# 28. రూపాంతరం

"పిల్లను చూశాను. కాని అంత తృప్తికరంగా లేదు" అన్నాడు సారథి.

"ఈసారి నీ కంప్లెయింట్ ఏమిటి!"

"ముఖ సౌందర్యం బాగానే వుంది. కాని ఆ పిల్లలో యీడుకు తగినంత పెరుగుదల కనిపించదు. సన్నగా పొడుగ్గా ఎములగూడల్లే వుంది."

"సరేకాని, నీకు ఎలాటి పిల్ల కావాలో కాస్త తెలియ చెప్పు. చూసిన ప్రతి సంబంధానికి ఏదో ఒక లోటును అంటకడతావు... అసలు నీ అభిరుచు లేమిటో ఒక ప్రకటన వేస్తే కొంతవరకూ లాభిస్తుందేమో? ఒక వేళ భూమి మీద నచ్చిన స్త్రీ దొరక్కపోతే నీ ఆశల్ని స్వర్గంమీద కేంద్రీకరించుకోవటానికైనా ప్రయత్నించవొచ్చు" అన్నాడు విశ్వనాథం.

"నేను సరిగ్గా 'ఇది' అని చెప్పలేదు. నువ్విప్పుడు నాకో పెద్ద ధర్మ సందేహాన్ని తెచ్చావు. అసలు మనం స్త్రీలో దేన్ని గూర్చి ఎక్కువ ఆకర్షింపబడతామా అని?"

"మనం అనవొక... నా పాటికి నేను చక్కగా సంసారం చేస్తూనే వుంటిని. ఇక నువ్వు దేనిచేత ఆకర్షించబడతా వనేదే ఇప్పుడు తేలాలి."

ఈ సమయంలో డాక్టరు సుబ్బారావు వొచ్చాడు. చాలారోజుల తరువాత సుబ్బారావును కలుసుకోవటం తటస్థించినందుకు, వారిద్దరూ ఎంతో ఆనందించారు. అతను వొస్తూనే విన్నమాటలూ, రాగానే స్నేహితుల ముఖాల్లో స్పష్టంగా చూసిన సమస్యాపరిష్కారం తాలూకు పట్టుదలా, సీరియస్‌నెస్ ఆకర్షించాయి.

"దేన్ని గూర్చి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అన్నాడు.

"పురుషుడు స్త్రీ వైపు ఆకర్షించబడే కారణం ఏమిటా అని. ముఖ సౌందర్యమా? సంస్కారమా? అవయవ సౌష్ఠవమా? ఇవన్నీనా? కాక ఇంకా మనకు తెలియనివి కూడానా?" అన్నాడు విశ్వనాథం.

డాక్టర్ ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు, "మనకు– అంటే సామాన్య మానవుడికి తెలియందే ఐవుంటుందేమో ననుకుంటాను. సౌందర్యవతి అయిన భార్య వుండగా, వికృత రూపంతో వున్న ఉంపుడుకత్తెలున్న వాళ్ళను మనం ఎరుగుదుం. అందుకని సౌందర్యం వొక్కటే మనిషిని ఆకర్షిస్తుందనేది అబద్ధమేమో? లేక ఆ మనిషి కళ్ళకు ఆ వికృతాకారమే ఒక సౌందర్య రాశిగా కనిపిస్తుందేమో కూడా సందేహించ వలసిన విషయమే!"

"మరి– ఐతే ఏమిటి?"

"ఒక్క ముక్కలో– కుండ బద్దలు కొట్టినట్టు దీనికి జవాబు చెప్పటం చాలా కష్టం. మనం ప్రతి స్త్రీని దూరంనుంచే చూచి ఆమె గుణగణాల్నీ; అందచందాల్నీ లెక్క వేస్తాం. ఆమెను నిజంగా అనుభవించి తనకు ఎంతో తృప్తికరంగా వున్నదనే వాడి అభిప్రాయాన్ని గౌరవించం. పై పెచ్చు ఎగతాళి చేస్తాం. ఎందుకనంటే, తను ఆమెవైపు ఎందుకని ఆకర్షించబడ్డాడో – ఆ వ్యక్తి కూడా తెలియ చెప్పలేని స్థితిలో ఉంటాడు. ఆ రహస్యం సామాన్య మానవుడికి తెలియనంత వరకూ ఆ ఆకర్షణకు భంగం ఉండదు..."

"వాడికి తెలియదన్నావ్... బాగానే వుంది. కాని యీ శాస్త్రజ్ఞులకూ మానవ మనస్తత్వవేత్తలకు కూడా తెలియకుండా వుంటుందా?"

"ఒక్కో సందర్భంలో తెలియవొచ్చు. యమయాతన పడితేనేగాని సరిగ్గా చెప్పటం కష్టం. అభిరుచులు మనిషి మనిషికీ మారుతూంటవి. వాటి మార్పులు మనకు తెలియకుండానే ఏ క్షణంలోనైనా జరగొచ్చు. కాని ఒకటి మాత్రం నిజమనుకుంటాను. మనిషి తాను కోరే మార్పును – అది మంచో చెడ్డో వేరే సంగతి – పొందగలిగినప్పుడు మాత్రం అతని తృప్తికి ఒక స్థానం లభిస్తుంది–"

"ఈ సోదంతా దేనికి? స్త్రీలలో పురుషుడికి కావలసిన ఆకర్షణ ఏమిటో తేలుద్దూ" అన్నాడు విశ్వనాథం విసుగ్గా.

"అదే చెప్పటం కష్టమనేది. ఈ మధ్య నా దగ్గరికో కేసు వచ్చింది. దాన్ని విశదంగా మీ కిప్పుడు చెప్తాను. వింటారా?"

సిద్ధపడినట్లు అందరూ సిగరెట్లు ముట్టించారు.

"నెల క్రితం నా దగ్గరికో పెద్ద మనిషి వొచ్చి, తను నానాటికి నపుంసకుణ్ణవు తున్నట్టు అనుమానంగా ఉన్నదన్నాడు. దానికి ఆయన చెప్పే కారణాలివి. మొదట్లో

తన పురుషత్వం మీద అతని కెంతో నమ్మకమట. తను ఇతర స్త్రీలను ఎరగడు. కాని, భార్యతో ఎంతో కులాసాగా, ఆనందంగా, రెండు సంవత్సరాలు కాపరం చేశాడట. ఇప్పుడు ఆమె పక్కమీదికి వొస్తే ఏదో క్రూర జంతువు బోనులో నుంచి తన మీదికి వొస్తూన్నట్టుగా వుంటుందట.

"నేను పరీక్షించాను. శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. ఇది మానసికమైన దెబ్బ ఐవుంటుందనే నమ్మకం కలిగింది. 'నీ భార్యలో నీకు కనిపించే మార్పు లేమిటి? అప్పటికీ ఇప్పటికీ ఆమె సౌందర్యంలో మార్పేమన్నా జరిగిందా?' అని అడిగాను. అతను చాలాసేపు తటపటాయించాడు. చివరకు ఇలా చెప్పాడు:

"ఆమె అంటే నా కెంతో ప్రేమ. ఇద్దరికీ ఒకరి మీద ఇంకోరికి చెప్పలేనంత అనురాగం వుంది. ఆమె ఇప్పటికీ నేనంటే ప్రాణమిస్తుంది. కాని నాకే క్రమంగా ఒక రకం అయిష్టత ఆమె మీద ఏర్పడ్డది. దీనికి ఒక్కటే పెద్ద కారణం నాకు కనిపిస్తుంది. ఆమె మెడ మీద ఒక పెద్ద పుట్టుమచ్చ వుంది. సంవత్సరం క్రితం వరకూ నేనిది గమనించ లేదు. ఏ క్షణాన నేనా పుట్టుమచ్చను మొట్టమొదటి సారిగా చూశానో, ఆ క్షణం నుండీ ఆమె అందమంతా వికృతరూపం దాల్చినట్టుగా భావించాను. అది తల్చుకున్నప్పుడల్లా ఆమె మీద ఎంతో విసుగు, కోపం, అయిష్టతా పుట్టుకొస్తాయి. నా పురుషత్వమే నశించినట్టనిపిస్తుంది."

"ఆ భార్య ఎంత అందగత్తో నేను చెప్పలేను. చంద్ర బింబానికి మచ్చల్లే ఆమె మెడమీద పుట్టుమచ్చ ఆమె అందాన్ని పాడు చేసిందేమో నన్న అనుమానం కలిగింది. అతని భార్యను పరీక్షించాను. బొగ్గుల్లో రామచిలకంటే నమ్మ. ఆమెను ఇతను ఇంత ప్రాణప్రదంగా ఎలా ప్రేమించ గలుగుతున్నాడో నాకు అర్థం కాలేదు. ఆమె ముఖ సౌందర్యానికీ, ఆ మెడమీద వున్న కనపడీ కనపడని ఆ పుట్టు మచ్చకూ పోలిక తీస్తే, ముఖ సౌందర్యం కనీసం లక్ష రెట్లు ఎక్కువ వికృతం అనొచ్చు. మొహం మీది పెద్ద పెద్ద మశూచికపు మచ్చలకన్న అతనికి యీ పుట్టుమచ్చ ఎందుకు వికృతంగా కనిపించిందో నాకు అర్థం కాలేదు. ఆమెనే అడిగాను. 'ఏమో నండీ! గదిలోకి వచ్చి నప్పుడల్లా దీనంగా, జాలిగా, నా మెడవైపు చూస్తారు. చూసి నన్ను విదిలించు కుంటారు. పగలల్లా నాతో ఎంతో ప్రేమగా, లాలనగా, మాట్లాడుతారు. కాని పడక గదిలో మాత్రం అవతలికి తిరిగి పడుకుంటారు' అంది.

"ఒక్కటే ఉపాయం తోచింది. ఆ పుట్టుమచ్చ భర్త దృష్టిని ఆకర్షించకుండా ఉండేట్టు చేస్తే చాలు. ఆ సంగతి అతనికి చెప్పినప్పుడు 'అది మీరు చేయగలిగితే నా జీవితం స్వర్గతుల్య మౌతుంది' అన్నాడు. ఆపరేషన్ చేశాను; మెడ మీది చర్మం తీసేసి శస్త్ర చికిత్స చేశాను. అతను ఎంతో తృప్తిని కనపరిచాడు. భార్యకన్న తనకు ప్రియమైన వస్తువు యీ ప్రపంచంలో లేదంటాడు" అని ముగించాడు డాక్టర్.

"అయితే ఆ పుట్టుమచ్చ మరి కనిపించకుండా మాయమై పోయిందా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నా తలకాయ. కనిపించకుండా ఎక్కడికి పోతుందీ? ఇది వరకు ఆ పుట్టుమచ్చ కనపడీ కనపడకుండా.. ఎంతో జాగ్రత్తగా చూస్తేనే కాని తెలియనట్టుగా వుండేది. కాని యీ అతుకు పడ్డాక దూరంనుంచి కూడా ఆ మాసిక స్పష్టంగా కనిపిస్తోంది. ఐతే మాత్రం- కావాల్సింది మార్పు - అంతే? ఏ పుట్టుమచ్చకైతే అతను విముఖతను చూపేవాడో, అది లేకపోతేనే చాలు - మానసికంగా అతని రోగం కుదిరేందుకు. నేనదే చేశాను!"

ఇద్దరి నోటా మాట లేకుండా పోయింది.

"ఇప్పుడు మీరు చెప్పండి - అసలు ఆ పెద్దమనిషి కోరిం దేమిటి? అతనికి వొచ్చిం దేమిటి?... మన కేదో పిచ్చి నమ్మకా లుంటవి. ఆ నమ్మకం మీదనే జీవితాన్ని ఆధారం చేసుకుంటామనే మాటను జ్ఞాపకం ఉంచుకోము... అంతే!"

"ఇందులో ఇంకో రహస్యం కూడా ఉన్నట్టు నాకు తోస్తోంది. మనం కోరేది ఏదై నప్పటికీ దానికి దరిదాపులో ఉండే దానిమీదికి మానవుడి మనస్సు ఇట్టే తిప్పేయ వొచ్చు ననుకుంటాను. నిజానికి స్త్రీ సుఖం ఒక స్త్రీ నుంచి ఇంకో స్త్రీకి మారటంలో అర్థం లేదేమో!"

"అంతే... అదే నిజం కూడాను. మన దృక్కోణాన్ని మారుస్తేనే కాని జీవితంలో సౌఖ్యం ఉండదనుకుంటాను" అన్నాడు సారథి.

ఇది జరిగిన పది రోజులకే సారథి పెళ్ళయింది- ఆ సన్నటి అమ్మాయితోనే! పెళ్ళయాక కాని ఆ అమ్మాయి డాక్టర్‌గారి మేనకోడలనే విషయం అతనికి తెలియ లేదు!

- మార్చి, *1949*